## 745 పశ్చాత్తాపము

"ఇక మీదట నీ కుమారుడ ననిపించుకొనుటకు యోగ్యుడనుకాననెను" లూకా15:21

నిను తండ్రి యని బిలువ నేతగనో దేవా ! నిను రానీయక హృదయమును మూసికొంటిన్ – పనికిమాలిన మార్గమున నడచుచుంటి

1. నోటితోడనె నే నిన్నొప్పుకొనుచుంటిన్ – మాటలోనే కాని మదిలోన లేదె – పాటింపకుంటినిన్ బ్రతుకులోనయ్యో॥
2. నిన్ను వలె పొరుగువానిని – సరిగానెంచు – మన్న యాజ్ఞను నేను మన్నించలేదె – అన్నీ నాకేకావలె ననుచుంటినయ్యో॥
3. నీ వాక్య పఠనంబు నీ నామధ్యానం – బేవేళ నామదికి వెగటుగదోచె నీ వాక్యమన చెవులు వినవాయెనయ్యో॥
4. పరిశుద్ధుల సహవాస భావమేలేదు ఇరుగు పొరుగుల చెలిమి యిసు మంతలేదు – పరుల దూరము బెట్ట పరువంటినయ్యో॥
5. సాతాను వలలోబడి చలియింపలేక – ఏతావుగనలేక నిలులైతి నకటా – నా తండ్రీ యిక దిక్కు నాకెవరులేరే॥
6. నిన్ను నమ్ముకొంటినిక నీవాడనౌదు – నను ముట్టి, లేపి జ్ఞానము, జీవ మిచ్చి – మనసును, హృదయమును మార్చుము దేవా

– సి.ఎ.జె.ప్రసాదరావు

## 746

రాగం : మిశ్రనటభైరవి తాళం : త్రిశ్రగతి

పల్లవి: అలసి సొలసి పోతిని – సేదదీర్చవా ప్రభూ!
ప్రశాంత జీవ జలముల – త్రాగనిమ్ము నిండుగ॥

1. దూరభారము లను నేను – పారజూడకుండ బోవ
గాలివాన సంభవింప – గుండెలోన గుబులు గలిగె॥
2. ముందు వెనుక జూడక – చెంగు చెంగు మంచు నెగుర
గుండురాయి కాలుదగుల – గుండెలోన గుబులు గలిగె॥
3. లోతుపాతు లెరుగక – ఎదురుగాను ఈదబోవ
గొంతుదాక మునిగిపోవ – గుండెలోన గుబులు గలిగె॥



4. మంచి చెడుగు లెంచక – కొంటెగాను సంచరించు
ఇంటివారె రోసివేయ – గుండెలోన గుబులు గలిగె ॥
5. కీడు మేలు లందున –మేలు మార్గమందు బోవక
కీడు సంభవింపగానె – గుండెలోన గుబులు గలిగె॥
6. జీవమరణమందలి – జీవమేమొ గానలేక
మరణ మెదురుపడిన వేళ – గుండెలోన గుబులు గలిగె ॥

– సి.ఎ.జె.ప్రసాదరావు

## 747

1. రమ్ము యెహోవారమ్ము ప్రభో – క్రమ్ముము నాదు హృదయమును= నా ప్రార్థనకు నీ చెవియొగ్గి – నామనవిని నాలకించుటకై ॥రమ్ము దేవ॥
2. విరివిగ వలచితి లోకమును – దరితము లెన్నోచేతిని భరింపలేని భారమును – హరింపజేసి రక్షింపన్ ॥రమ్ముదేవ॥
3. తలచితి నాదు పాపములన్ – తలచితివాని ఫలితములన్ తలంపుకే మది చెదరినది – తొలగింప నన్నాదురిత స్థితిన్ ॥రమ్ముదేవ॥
4. కరములు చాచి పిలుచుచుండన్ – త్వరపడి రమ్ము సహాయపడన్= మొరాలకించుము చెవియొగ్గి – బిరాన నను విడిపించుటకై ॥రమ్ముదేవ॥
5. నా రక్షకుండు విమోచకుడై – ఆనంద సంతోషముల నిచ్చు నా దేవునిన్ నే చూచుటకు – నేడే యాసించుచు వేచియుంటిని ॥రమ్ముదేవ॥
6. శుద్ధమగు హృదయంబును – సుస్థిరమగు విశ్వాసమును నిశ్చలభక్తిని నాయందున – నూతనముగా పుట్టించుటకు ॥రమ్ముదేవ॥
7. మలిపితి నీపై నామనసున్ – నిలిపితి నీపై నమ్మికను చలించ కుండగ కాపాడన్ – పాలింప రమ్ము పరమ తండ్రీ॥రమ్ముదేవ॥
8. కురిపించుము నీయాత్మన్ నా పై – వర్షించుము నీ కృపన్ నాపై=తరింప జేయుము నాతనువున్ – స్మరించెదను నిను నిరతమున్ ॥రమ్ముదేవ॥

– సి.ఎ.జె.ప్రసాదరావు